సాక్షి గుంటూరు

శనివారం । 4 । మార్చి । 2023



భూసర్వేకు సహకరించాలి

మేదరమెట్ల: భూ రీసర్వేకి రైతులు సహకరించాలని జేసీ కే.శ్రీనివాసులు అన్నారు. కొరిశపాడు మండలం పీ.గుడిపాడులో రాళ్ల ఏర్పాటును జేసీ శుక్రవారం ప్రారంభించారు.



నేడు ప్రకాశం జెడ్పీ సమావేశం

బాపట్ల: ప్రకాశం జిల్లా పరిషత్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11గంటలకు జరుగుతుందని సీఈఓ జాలిరెడ్డి తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు.

పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక మూడో రోజు గుంటూరు జిల్లాలో 97.36 శాతం పంపిణీ పూర్తయింది. శుక్రవారం సాయంత్రానికి 2,46,548 మందికి రూ.67.73 కోట్లు అందజేశారు.

న్యూస్‌రీల్

యార్డులో 98,597 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 90,137 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 98,597 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 73,182 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

100 సవర్ల బంగారం, రూ.6 లక్షలు మాయం

తనయుడే తస్కరించాడని పోలీసులకు తండ్రి ఫిర్యాదు

చీరాల: చెడు వ్యసనాలకు అలవాటుపడి ఇంట్లోనే చోరీ చేశాడు కుమారుడు. ఈ ఘటన పట్టణంలోని జాలాది కాంప్లెక్స్‌లో జరిగింది. వన్‌టౌన్ సీఐ మల్లేశ్వరరావు వివరాల మేరకు.. పట్టణంలోని జాలాది కాంప్లెక్స్‌లో నివసించే జూలకంటి సుబ్బారావు వస్త్ర వ్యాపారం చేస్తుంటాడు. గతేడాది డిసెంబర్‌లో తన చిన్నకుమారుడు జూలకంటి బాలకృష్ణ కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కొద్ది రోజులుగా ఇంట్లో దాచిన ఉంచిన 100 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.6 లక్షల నగదు కూడా కనిపించకపోవడంతో తన చిన్నకుమారుడే అపహరించి స్థానిక ప్రైవేట్ బ్యాంకులో కుదువ పెట్టాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

7న మెడికల్ కాలేజీ డే వేడుకలు

గుంటూరుమెడికల్: గుంటూరు వైద్య కళాశాల కాలేజ్ డే వేడుకలను ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతిదేవి తెలిపారు. కాలేజ్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ విచ్చేస్తున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ప్రారంభమయ్యే కాలేజ్ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కాలేజ్ డే సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు మార్చి 6న అవార్డ్స్ పంపిణీ చేస్తారన్నారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి అవార్డ్స్ అందజేస్తారన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాలేయ మార్పిడి ఆపరేషన్‌లకు రంగం సిద్ధం



గుంటూరుమెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో జీజీహెచ్‌లో ఆపరేషన్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసేందుకు స్పెషల్ టీమ్ తనిఖీలు చేసింది. మరలా శుక్రవారం లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు చేసే డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ సెల్వకుమార్‌ల బృందం ఆసుపత్రిలో వసతులను పరిశీలించింది. కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు నాట్కో క్యాన్సర్ సెంటర్, ఏబీసీ ఆపరేషన్ థియేటర్, సీటీవీఎస్ వార్డు, ఎంఐటీలను ప్రత్యేక బృందం పరిశీలించింది. ఆపరేషన్ థియేటర్ల పరిశీలనతోపాటు గతంలో కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన శిక్షణ తీసుకున్న గుంటూరు జీజీహెచ్ వైద్యులతో ప్రత్యేక బృందం సమావేశం నిర్వహించింది. వైద్య బృందంతోపాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత, సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సుందరాచారి, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాధికారాణి, ఇతర వైద్య విభాగాధిపతులు సైతం సమావేశంలో పాల్గొని లివర్ మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు ఉన్న అవరోధాలను ఏవిధంగా అధిగమించాలనే విషయాలపై చర్చించారు.

చిత్తశుద్ధితో అభివృద్ధి

- 15వ ఆర్థిక సంఘ నిధులతో పనులు చేపట్టేందుకు నిర్ణయం
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో ఆమోదించిన చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా
- జిల్లా, మండలస్థాయిలోనూ కమిటీలు

రూ. 6.37 కోట్లతో గ్రామాల్లో రోడ్లు కాలువల నిర్మాణం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులతోపాటు రహదారుల నిర్మాణాలను 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.37 కోట్లతో చేపట్టేందుకు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో ఆమె ఛాంబర్లో నాలుగు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య–వైద్యం, పనులకు సంబంధించిన స్థాయీ సంఘ సమావేశాలను ఆయా సంఘాల్లో సభ్యులుగా ఉన్న జెడ్పీటీసీలతోపాటు సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. 15వ ఆర్థిక సంఘ బేసిక్ గ్రాంటు నుంచి గ్రామాల్లో నూతన సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, రోడ్లకు మరమ్మతులు, వివిధ గ్రామాల్లో శ్మశాన వాటికలు, రోడ్లకు గ్రావెలింగ్ వంటి 112 పనులను ఆమోదించారు. నరసరావుపేట మండలంలోని కొండకావూరు పరిధిలో కోటప్పకొండలోని వివిధ ప్రాంతాల్లో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేసేందుకు మొత్త ఐదు విభాగాలు చేపట్టనున్న పనులకు సంబంధించి జెడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.44.78 లక్షల ప్రతిపాదనలను ఆమోదించారు.

➡ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 351 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న 22,104 మంది విద్యార్థులకు సాయంత్రం వేళలో అల్పాహారాన్ని అందించేందుకు జెడ్పీ నుంచి ముందస్తు కేటాయించిన రూ.49,73,400 ఆమోదం తెలిపారు.

➡ నరసరావుపేట, తాడికొండ నియోజకవర్గాల్లో రోడ్ల నిర్మాణాలకు 15వ ఆర్థిక సంఘ బేసిక్ గ్రాంటు నుంచి రూ.33.50 లక్షలు కేటాయిస్తూ ఆమోదించారు. ఆరు శాతం ఎస్టీ గ్రాంటు ద్వారా నరసరావుపేట నియోజకవర్గంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాన్ని చేపట్టేందుకు ఆమోదం తెలిపారు.

➡ నిజాంపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో మాజీ రాష్ట్రపతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు అనుమతించారు.

ఆస్తుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

జెడ్పీకి చెందిన ఆస్తులను పరిరక్షించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా చెప్పారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని జెడ్పీకి చెందిన ఆస్తులను గత పాలకవర్గాల హయాంలో ఇష్టారాజ్యంగా కేటాయింపులు జరిపి, అన్యాక్రాంతం చేశారని, ప్రస్తుతం తాము గత ఏడాది కాలానికి పైగా ఆస్తుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జెడ్పీ సీఈవో జె.మోహనరావు మాట్లాడుతూ జెడ్పీ ఆస్తులను పరిరక్షించేందుకు తొలిసారిగా గత నెలలో మూడు జిల్లాల ఆర్డీఓల నేతృత్వంలో ఎంపీడీఓలందరితో కలిసి నిర్వహించిన సమావేశం ద్వారా రెవెన్యూశాఖతో సమన్వయం చేసుకునేందుకు అడుగు ముందుకు పడిందని చెప్పారు. జెడ్పీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడటంతోపాటు ఆదాయాన్ని పెంచుకునేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

➡ మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం నాణ్యతపై హెచ్‌ఎంలకు అవగాహన కల్పించడం ద్వారా మరింత ఎక్కువమంది విద్యార్థులు జగనన్న గోరుముద్దను తీసుకునేలా చూడాలని క్రిస్టినాతోపాటు ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జెడ్పీటీసీలు అభిప్రాయపడ్డారు. వ్యవసాయంపై జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన స్థాయీ సంఘాలు భేటీ అయ్యాయి.

పల్నాడు డీఈఓను సరెండర్ చేయాలి

విద్య–వైద్యంపై జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పల్నాడు డీఈఓ ఎం.వెంకటప్పయ్య ఉపాధ్యాయుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇటీవల వినుకొండలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉపాధ్యాయులను యూజ్‌లెస్ ఫెలోస్ అంటూ డీఈఓ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, ఉపాధ్యాయులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పల్నాడు డీఈఓ వెంకటప్పయ్య గైర్హాజరు కావడంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ఇదే విధమైన వ్యాఖ్యలు చేసిన సందర్భంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. ఇటువంటి అధికారి విద్యాశాఖకు తగడని, ఆయన్ను తక్షణమే ప్రభుత్వానికి సరెండర్ చేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా మాట్లాడుతూ పల్నాడు డీఈఓ వ్యవహారశైలిపై పలువురు ఉపాధ్యాయులు తనకూ ఫిర్యాదు చేశారని చెప్పారు.

సింహవాహనంపై మంగళాద్రిపతి

శోభాయమానంగా నారసింహుని బ్రహ్మోత్సవాలు



సింహవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి గ్రామోత్సవంలో సింహవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో సింహవాహనంపై కొలువుదీరిన బ్రహ్మాండనాయకుడు నృసింహస్వామి భక్తులు దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చి దర్శించుకున్నారు. ఉత్సవం సందర్భంగా శ్రీ రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు సాంస్కృతిక కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నరసింహుని వేషాలు, భజనలు, నృత్యాలు, కూచిపూడి నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), మల్లాది విష్ణులు స్వామి వారికి పూజలు నిర్వహించి రథాన్ని లాగి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్కే శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళావేదికలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి కళాకారులను అభినందించారు. ఆలయ ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

నేడు హంస, గజవాహనాలపై..

బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం గజవాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమివ్వనున్న శ్రీవారు అదేరోజు రాత్రి ఏడు గంటలకు గజవాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఈవో తెలిపారు.



సాదర స్వాగతం

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్(జీఎస్ఐ)కు విచ్చేసిన పారిశ్రామిక దిగ్గజం ముఖేష్ అంబానీకి స్వాగతం పలుకుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, చిత్రంలో ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రులు వేణుగోపాలకృష్ణ, ఆదిమూలపు సురేష్ –సాక్షి, ఫొటోగ్రాఫర్

నేటి నుంచి విజ్ఞాన్ నిరులోత్సవ్–2కే23



నిరులోత్సవ్ వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక తదితరులు

గుంటూరురూరల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు జాతీయ స్థాయిలో విజ్ఞాన్ నిరులోత్సవ్ 2కే23 నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో నిరులోత్సవ్ వాల్‌పోస్టర్‌లను శుక్రవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ శని, ఆదివారాలలో జరగనున్న పోటీలు మొత్తం 39 విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకలకు 15వేల మందికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. మొదటి రోజు జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జీ.రాజకుమారి, నరసాపురం జిల్లా సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ హాజరవుతారని పేర్కొన్నారు. ఆదివారం జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు, ఇండియన్ స్క్రీన్ రైటర్ అండ్ ఫిల్మ్ డైరెక్టర్ కే.వీ.విజయేంద్ర ప్రసాద్, ఇండియన్ యాక్టర్ అండ్ కమెడియన్ పీ ప్రియదర్శిని హాజరవుతారని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సాంస్కృతిక, క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఎంబీఏ విద్యార్థులతోపాటు డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీలలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి ఆకర్షణీయ నగదు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజయ గీతం.. ఉత్సాహ నాదం

- కన్నీటిని నాట్యంగా మార్చగలిగే దేవుడు ఏసుక్రీస్తు
- రెండో రోజు సభలో హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం
- కొనసాగుతున్న గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు



గీతాలు ఆలపిస్తున్న బ్రదర్ అబ్రహాం, పాస్టర్లు జాన్‌వెస్లీ, ఫ్రైడీపాల్, రమేష్

గుంటూరు రూరల్: పశ్చాత్తాపంతో విడిచే కన్నీరు దేవునికి చేరుతుందని, అటువంటి హృదయాలను దేవుడు అంగీకరించి, వారి కన్నీటిని నాట్యముగా మారుస్తాడని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం అన్నారు. నగర శివారులోని గోరంట్ల గ్రామంలో హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న 46వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు శుక్రవారం కొనసాగాయి. పిడుగురాళ్లకు చెందిన పాస్టర్ ఇమ్మానుయేలు ప్రార్థన చేసి ప్రారంభించారు. అనంతరం కార్యక్రమంలో సండే స్కూల్ చిన్నారులు, హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్స్, సిస్టర్స్ బృందం స్తుతి గీతాలను ఆలపించారు. అనంతరం క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందిస్తూ బ్రదర్ అబ్రహాం మాట్లాడుతూ ప్రభువు మన వైపు చూస్తున్నాడని.. ఆయన మన జీవితాన్ని మార్చగలడన్నారు. తమిళనాడుకు చెందిన పాస్టర్ మోహన్ సి.లాజరస్ సందేశాన్నిస్తూ ఎటువంటి పరిస్థితిలోనైనా కలవరపడకూడదని చెప్పారు. ఏసుక్రీస్తు అందరినీ ఆదరించే దేవుడన్నారు.

పరిశుద్ధాత్మ కుమ్మరింపు..

ఉదయం జరిగిన ప్రత్యేక ప్రార్థనలను వినుకొండకు చెందిన పాస్టర్ జాన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. కడపకు చెందిన పాస్టర్ జాన్‌పాల్ మాట్లాడుతూ ఏసు క్రీస్తునందు నమ్మకమైన దాసులుగా ఉండాలన్నారు. కర్నూలుకు చెందిన పాస్టర్ ఫ్రెడిపాల్ సందేశాస్తూ దేవుని పరిశుద్ధాత్మ మనపై కుమ్మరిస్తారని తెలిపారు. ఒంగోలుకు చెందిన పాస్టర్ రాజు క్రీస్తుని సందేశాన్ని విశ్వాసులకు అందజేస్తూ ఏసు క్రీస్తు మరణ శాసనాన్ని రద్దు పరుస్తాడన్నారు. ఆయన మరణాన్ని గెలిచిన దేవుడని తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో రెండో రోజు సుమారు 2 లక్షలకు పైగా భక్తులు పాల్గొన్నారు. భక్తుల కోసం భోజన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం పోలీస్, ఆర్‌టీసీ, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు.

మల్బరీ సాగు.. లాభాలు బాగు

- పట్టుకు ప్రభుత్వం చేయూత
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రెండేళ్లుగా నిలకడగా ఆదాయం



మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సెరికల్చర్ అధికారులు

కొరిటిపాడు(గుంటూరు): మల్బరీ సాగు క్షీణిస్తున్న తరుణంలో ప్రభుత్వం చేయూతనిస్తోంది. రైతులకు వివిధ రకాలుగా రాయితీలు కల్పిస్తుండడం, సెరీకల్చర్ అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తుండడంతో మల్బరీ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. గతంలో మల్బరీ సాగుకు సరైన ప్రోత్సాహం లేకపోవడం, అనుకున్న మేర ధరలు లేక రైతులు నష్టాలు చవిచూశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెరికల్చర్ అభివృద్ధికి పలు ప్రోత్సాహకాలు, రాయితీలు తీసుకొచ్చింది. దీంతో మల్బరీ సాగు పట్ల రైతులు ఆసక్తి చూపడంతో రోజురోజుకు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రస్తుతం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 255 మంది రైతులు 676 ఎకరాల్లో సాగు చేశారు.

రైతులకు అందుతున్న రాయితీలు

పట్టు పురుగుల పెంపకం కోసం షెడ్డు నిర్మించుకోవడానికి ఒక్కో ఎస్సీ, ఎస్టీ రైతుకు ప్రభుత్వం రూ.3.60 లక్షలు, జనరల్ రైతులకు రూ.3 లక్షలు రాయితీ ఇస్తోంది. మల్బరీ సాగు చేయడం కోసం పెట్టుబడిగా ఎకరాకు ఎస్సీ, ఎస్టీ రైతుకు రూ.22,500, జనరల్ రైతులకు రూ.18,500 చొప్పున రాయితీ ఇస్తోంది. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఇప్పటి వరకు 18 మంది రైతులు ప్రభుత్వ రాయితీతో షెడ్లు నిర్మించుకున్నారు. రైతులు పట్టు గూళ్లు విక్రయించిన సమయంలో ఒక కిలోకి రూ.50 చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహకంగా ఇస్తోంది. మల్బరీ సాగుకు అవసరమైన క్రిమిసంహారక మందులు, ఎరువులకుగానూ రూ.3,750 చొప్పున రాయితీ ఇస్తోంది. పట్టుగూళ్లు విక్రయించుకోవడానికి వీలుగా పలు ప్రాంతాల్లో ప్రభుత్వం విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ప్రధానంగా హనుమాన్‌జంక్షన్, పలమనేరు, మదనపల్లె, కుప్పం, హిందూపురం, ధర్మవరం, కదిరి, చేబ్రోలు కేంద్రాలు పట్టు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం సీబీ రకం పట్టు గూళ్ల కేజీ రూ.650 నుంచి రూ.750 వరకు ధర పలుకుతోంది. బై ఓల్టెన్ రకం పట్టు గూళ్ల కేజీ రూ.700 నుంచి రూ.800 వరకు ధర పలుకుతోంది. ఒక ఎకరా సాగు చేయడం ద్వారా ఒక ఏడాదికి 800 నుంచి 1000 కిలోల వరకు పట్టుగూళ్ల ఉత్పత్తి అవుతున్నట్లు సెరికల్చర్ అధికారులు చెబుతున్నారు.


ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది...



మల్బరీ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది. రాయితీతో షెడ్డు నిర్మాణం చేపట్టాం. నేను నాలుగు ఎకరాల్లో మల్బరీ సాగు చేశా. మిగతా పంటలతో పోల్చుకుంటే మల్బరీ సాగుతో నికరమైన ఆదాయం వస్తోంది.

–పి.శివరామిరెడ్డి, రైతు, పొన్నెకల్లు గ్రామం, తాడికొండ మండలం.


పట్టుగూళ్ల ధరలు స్థిరంగా ఉన్నాయి



రెండేళ్లుగా పట్టుగూళ్ల ధరలు కూడా స్థిరంగా ఉండడంతో రైతులకు లాభదాయకంగానే ఉంది. నేను మూడున్నర ఎకరాల్లో మల్బరీ సాగు చేశా. సెరికల్చర్ అధికారులు తరచూ సూచనలు, సలహాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇతర రైతులు కూడా మల్బరీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

–జి.రామాంజనేయులు, రైతు, బ్రాహ్మణపల్లి గ్రామం, వినుకొండ మండలం.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి



లాభదాయకమైన వంట మల్బరీ సాగుపై రైతులు ఆసక్తి చూపాలి. మల్బరీ ఒకసారి సాగు చేస్తే 15 నుంచి 18 సంవత్సరాల వరకు కోతకు వస్తూనే ఉంటుంది. ఒక ఏడాదిలో ఐదు పంటలు దిగుబడి చేసుకోవచ్చు. పట్టు పురుగులను సెరికల్చర్ అధికారులు వారం రోజులపాటు పెంచి రైతులకు ఇస్తారు. రైతులు 20 రోజులు మాత్రమే సంరక్షించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రాయితీలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–రాధా రాణి, పల్నాడు జిల్లా సెరికల్చర్ అధికారి

చెట్టును ఢీకొన్న స్కూటీ

ఉపాధ్యాయురాలు మృతి



మృతి చెందిన ఉపాధ్యాయురాలు శ్యామలాదేవి

పెదకాకాని: స్కూటీ అదుపుతప్పి చెట్టుని ఢీకొని ఉపాధ్యాయురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం వెనిగండ్ల శివారులో చోటుచేసుకుంది. గుంటూరు నగరానికి చెందిన కాంద్రుకొండ శ్యామలాదేవి(44) ఆరేళ్లుగా మంగళగిరి రూరల్ మండలం నిడమర్రు జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. గతంలో మంగళగిరి నుంచి ప్రతి రోజూ స్కూల్‌కి వెళ్లేది. రెండు నెలల కిందట గుంటూరు శాంతినగర్‌లో నూతనంగా ఇల్లు నిర్మించుకున్నారు. దీంతో గుంటూరు నుంచి వెనిగండ్ల గ్రామం మీదుగా నిడమర్రు పాఠశాలకు వెళుతుంది. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం స్కూటీపై పాఠశాలకు బయలుదేరింది. వెనిగండ్ల శివారు ప్రాంతంలోకి చేరుకునే సరికి ఆమె ప్రయాణిస్తున్న స్కూటీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో చెట్టు పక్కనే ఉన్న కాలువలో పడింది. తలకు హెల్మెట్ పెట్టుకోవడంతోపాటు ముఖానికి స్కార్ఫ్ కట్టుకున్న ఆమె నీటి కాలువలో బోర్లపడడంతో ఊపిరి ఆడక మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతురాలి కుమారుడు జగదీష్ సిద్ధార్థ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేష్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

పశ్చిమకు 2212 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 2212 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 126 , బ్యాంక్ కెనాల్‌కు 250, తూర్పు కెనాల్‌కు 277, పశ్చిమ కెనాల్‌కు 23, నిజాంపట్నం కాలువకు 152, కొమ్మమూరు కాల్వకు 1160 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి
- ప్రభుత్వ ఛాతి, సంక్రమిత వ్యాధుల ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి

గుంటూరు రూరల్: ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్యులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల రెడ్డి సూచించారు. శుక్రవారం అమరావతిరోడ్డు గోరంట్లలోని ప్రభుత్వ ఛాతి, సంక్రమిత వ్యాధుల వైద్యశాల అభివృద్ధి సొసైటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రిలో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, నాడు నేడు ద్వారా ఆసుపత్రి ఆవరణలో రూ.40 కోట్లతో నిర్మిస్తున్న భవనం నిర్మాణ వివరాలు, ఆర్థిక సంవత్సరం ఖర్చు చేసిన నిధులు, ఇతర ఖర్చులపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇన్ పేషంట్‌గా చేరి చికిత్స పొందుతున్న రోగులను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం క్రింద ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. దీని వలన రోగులకు చికిత్స సమయంలో ఆరోగ్య ఆసరా నగదు అందించవచ్చని, ఆసుపత్రి అభివృద్ధికి నిధులు సమకూరతాయన్నారు. ఆసుపత్రిలో గత కొంత కాలంగా చికిత్స పొందుతున్న రోగులలో చాలా తక్కువ మంది మాత్రమే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకంలో నమోదు అవుతున్నారని, వైద్యులు ప్రత్యేక దృష్టి పెట్టి నూరు శాతం రోగులను ఆరోగ్యశ్రీ పథకంలో నమోదు చేయించాలన్నారు. దీనిపై మార్చి నెల ప్రతిరోజు ఆసుపత్రిలో ఇన్ పేషంట్‌లో చేరిన రోగుల వివరాలు, ఆరోగ్య శ్రీలో నమోదు అయిన వారి వివరాలు, నమోదు కాని వారి వివరాలు కారణాలతో సహా నివేదిక అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన 6కెఎల్ సామర్థ్యం ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను, 1000ఎంఎల్ సామర్థ్యం ఉన్న జగనన్న ప్రాణవాయువు కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆసుపత్రి అవరణలో రోగులకు మంచినీటి కోసం త్రిబులెక్స్ సోప్స్ అధినేత మాణిక్యవేలు ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన మంచినీటి ఆర్వో ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డా. ఏ శ్రావణబాబు, డీసీహెచ్‌ఎస్ జె.హనుమంతరావు, ఎపీఎంఐడీసీ ఈఈ శ్రీధర్, నగరపాలక సంస్థ మెడికల్ ఆఫీసర్ విజయలక్ష్మి, వేలు ప్రవీణ్ రాజు,ఆసుపత్రి వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు భూగర్భ శాస్త్రం పునాది

- వీసీ ఆచార్య పి.రాజశేఖర్
- జియాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రారంభమైన జాతీయ సదస్సు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్, వేదికపై రిజిస్ట్రార్ ఆచార్య కరుణ, డాక్టర్ పీజే రత్నాకర్

ఏఎన్‌యూ: మానవ మనుగడకు భూగర్భ శాస్త్రం పునాది అని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జియోసైన్సెస్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ (ఆర్‌టీజీఎస్-2023) అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును శుక్రవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసంగిస్తూ అన్ని సహజవనరులకు భూమి మంచి నెలవు అన్నారు. వనరులు, శక్తి స్థిరత్వంపైనే మానవ స్థిరత్వం ఆధారపడి ఉంటుందన్నారు. హైదరాబాద్ ఎన్‌జీఆర్‌ఐ(నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) విశ్రాంత ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ వి.బలరామ్ కీలకోపన్యాసం చేస్తూ ఎన్‌జీఆర్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అధ్యయనాల్లో ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో విలువైన భూగర్భ ఖనిజాలను నిర్ధారించడం జరిగిందన్నారు. సదస్సు డైరెక్టర్, జియాలజీ విభాగాధిపతి డాక్టర్ పీజే రత్నాకర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ భూగర్భ శాస్త్రంలో అనేక కోణాలలో అధ్యయనాలు, పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. వాటికి మరింత ఉపయోగపడే నూతన అంశాలను జాతీయ స్థాయిలో చర్చించాలనే ఉద్దేశంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ ప్రసంగిస్తూ భూగర్భ శాస్త్రం, భౌగోళిక స్థితిని అధ్యయనం చేయడమనేది నిరంతర ప్రక్రియ అన్నారు. ఏశాక్(ఆంధ్ర ప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్) డైరెక్టర్ ఎ.నాగేశ్వరరావు ప్రసంగిస్తూ జియాలజీ రంగంలో జరిగే పరిశోధనలకు ఏపీశాక్ పూర్తి సహకారం అందిస్తోందన్నారు. వారణాసి బెనారస్ హిందూ యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య ఎన్‌వీ చలపతి రావు ప్రసంగిస్తూ శాస్త్రాలన్నింటిలోకెల్లా భూగర్భ శాస్త్రం ఎంతో పురాతనమైనదన్నారు. ఉత్తరాఖండ్ కుమాయున్ యూనివర్సిటీ అధ్యాపకుడు ఆచార్య సంతోష్ కుమార్ ప్రసంగిస్తూ విశ్లేషణాత్మకమైన పరిశోధనలు ఈ రంగంలో ఎంతో కీలకమన్నారు. ఉత్తర ప్రదేశ్ బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ అధ్యాపకుడు ఆచార్య ఎంఎం సింగ్ ప్రసంగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థలో భూగర్భ రంగం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్‌ను వీసీ, అతిథులు ఆవిష్కరించారు. ఏఎన్‌యూ సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, యూనివర్సిటీ పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయకుమార్, అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య బి.హరిబాబు, జియాలజీ విభాగ అధ్యాపకుడు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ ఇశ్రాయేలు, డాక్టర్ శరత్, పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో నైపుణ్యాన్ని వెలికితీయండి

ఏపీ ఎన్జీవో గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, సతీష్‌కుమార్

గుంటూరు మెడికల్: గెలుపోటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని తమలోని అంతర్లీనంగా ఉండే నైపుణ్యాలను వెలికి తీయాలని ఏపీ ఎన్జీవో గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతోందని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శుక్రవారం గుంటూరు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలులో మహిళలకు క్రీడా పోటీలు జరిగాయి.

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాస రావు, శెట్టిపల్లి సతీష్ కుమార్‌లు జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. నగరంలోని అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న మహిళల ఉద్యోగులు పలు క్రీడల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్ర, శనివారాల్లో క్రీడల్లో పాల్గొనే మహిళలకు జిల్లా కలెక్టర్ అనుమతి మంజూరు చేశారని అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. శనివారం జరిగే క్రీడా పోటీల్లో నగరంలోని వివిధ శాఖలలో పని చేసే మహిళ ఉద్యోగులు అత్యధికంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా చైర్‌పర్సన్ ఎం.రాధారాణి, కన్వీనర్ లక్ష్మీ రమ్య పాల్గొన్నారు.

పిల్లలకు వైకల్య నిర్ధారణ పరీక్షలు



బాలుడిని పరీక్షిస్తున్న డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలను అందజేసేందుకు శుక్రవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో ఉచిత నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. సమగ్ర శిక్ష గుంటూరు జిల్లా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి సారథ్యంలో నిర్వహించిన వైకల్య నిర్ధారణ పరీక్షా శిబిరానికి పుట్టుకతో శారీరక, మానసిక వైకల్యాలతో బాధపడుతున్న పిల్లలతో తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ బుద్ధిమాంద్యం, వినికిడి, దృష్టి లోపాలున్న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శారీరక వైకల్యం ఉన్నవారికి వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, రోలేటర్స్, బుద్ధి మాంద్యం గల వారికి కిట్లు, కంటి చూపు దెబ్బతిన్న వారికి బ్రెయిలీ కిట్లు అందిస్తామని చెప్పారు. శిబిరంలో సమగ్ర శిక్ష సహిత విద్య విభాగ జిల్లా సమన్వయకర్త ఎస్. శ్రీనివాసరావు, జీజీహెచ్ వైద్యులు రమణయశస్వి, సైకాలజిస్ట్ సాయికిరణ్, ఆప్తమాలజిస్ట్ చంద్రశేఖర్, ఈఎన్‌టీ వైద్యుడు అరుణ్ కుమార్, ఆడియాలజిస్ట్ నివేదిత పాల్గొని పిల్లలకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు


లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు కేటాయించడం జరిగిందని డివిజన్ సీనియర్ డీసీఎం శుక్రవారం రాత్రి వెల్లడించారు. రైలు నెంబర్ 06549 బెంగళూరు-నరసాపూర్ వయా గుంటూరు డివిజన్ మీదుగా ఈనెల 5వ తేదీన ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ రైలు బెంగళూరు స్టేషన్ నుంచి ఉదయం 11.20 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు నరసాపూర్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 06550 నరసాపూర్-బెంగళూరు రైలు ఈనెల 6వ తేదీన ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని ఈ రైలు సోమవారం మధ్యాహ్నం 3.40 గంటలకు నరసాపూర్ స్టేషన్ నుంచి బయలు దేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు బెంగళూరు స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు ఎలహంకా, హిందూపూర్, ధర్మవరం, అనంతపూర్, గుత్తి, డోన్, నంద్యాల, గిద్దలూరు, కంభం, మార్కాపూరం రోడ్డు, వినుకొండ, నరసారావుపేట, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, పాలకొల్లు స్టేషన్ల మీదుగా రైలు ప్రయాణిస్తుందని తెలిపారు. ఈ రైలుకు టూ, త్రి టైర్ ఏసీ కోచ్‌లతోపాటు స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లను కేటాయించడం జరిగిందని తెలిపారు.

నేటి నుంచి విట్- ఏపీలో విటోపియా-2023

తాడికొండ: నేటి నుంచి రెండు రోజుల పాటు ఐనవోలు వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయంలో విటోపియా-2023 వార్షిక క్రీడలు, సాంస్కృతిక ఉత్సవం ప్రారంభించనున్నట్లు కళాశాల నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా క్రీడాకారిణి పీవీ సింధు, ప్రముఖ సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్, టాలీవుడ్ నటీనటులు, స్టాండ్ అప్ కమీడియన్లు పాల్గొననున్నారని తెలిపారు. రెండు రోజుల పాటు క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

విద్యార్థుల భోజనం రుచిగా ఉండాలి

అక్షయపాత్రను పరిశీలించిన రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి



మంగళగిరి: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచిగా ఉండాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగర పరిధిలోని ఆత్మకూరు అక్షయ పాత్ర కేంద్రీయ వంటశాలను సందర్శించారు. వంటశాల ఎప్పుడు పరిశుభ్రతగా ఉండాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 26 జిల్లాలు పర్యటించడం జరిగిందని, విద్యార్థులతో మాట్లాడి భోజనం గురించి తెలుసుకుని భోజనంలో లోటు పాట్లను గమనించి సరిచేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అక్షయ పాత్ర సైతం పిల్లలకు మరింత ఇష్టపడి తినే విధంగా భోజనాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో అక్షయపాత్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు గ్రూప్‌-2పై ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్‌: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్‌-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల ప్రయోజనార్థం ఆదివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్‌ అకాడమీ చైర్మన్‌ పి.కృష్ణప్రదీప్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌ అశోక్‌నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న సదస్సులో సీనియర్‌ అధ్యాపకులు గ్రూప్‌-2 సిలబస్‌, ప్రిపరేషన్‌ స్ట్రాటజీ, నోట్సు మేకింగ్‌, సమయపాలన తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉచిత అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 91332 37733, 040-35052121 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



పట్నంబజారు: రజక సామాజిక వర్గానికి చెందిన పేద కుటుంబానికి నగర రజక జనసేవా సంఘం ఆర్థిక చేయూతనందించింది. బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఎదుట గంగానమ్మ కమ్యూనిటీ హాలు ఎదుట వివాహ కార్యక్రమంలో శుక్రవారం వైఎస్సార్‌ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళ నేత షేక్‌ నూరిఫాతిమా చేతుల మీదుగా రూ. 50వేలు అందజేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల్ని ఆదుకునేందుకు రజక సంఘం నేతలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పాపారావు, కార్యదర్శి లక్ష్మణరాజు, లింగా భిక్షం, మొగిలి ప్రసాద్‌, ఇర్రి సాయి, మణికంఠ పాల్గొన్నారు.

తొమ్మిది మొబైల్‌ ఫోన్లు అప్పగింత



నగరంపాలెం: మొబైల్‌ ఫోన్లను పోగొట్టుకున్న బాధితుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన గుంటూరు పోలీస్‌ వాట్సాప్‌ నంబర్‌ నిరంతరం అందుబాటులో ఉంటుందని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌ హఫీజ్‌ తెలిపారు. జిల్లాలోని మరో తొమ్మిది మందికి పోగొట్టుకున్న ఫోన్లను శుక్రవారం జిల్లా పోలీస్‌ కార్యాలయ ఆవరణలో ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడేళ్ల కిందట పోయిన ఫోన్లను కూడా అప్పగించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వాట్సాప్‌ 8688831574 నంబర్‌ను బాధితులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఫోన్లను గుర్తించడంలో ప్రతిభ చాటుతున్న ఐటీ కోర్‌ ఇన్‌చార్జి ఎస్‌ఐ డి.వెంకటకృష్ణ, కానిస్టేబుళ్లు రమేష్‌, కరీముల్లా, శ్రీధర్‌ను అభినందించి ప్రశంస పత్రాల్ని అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (పరిపాలన) కె. సుప్రజ, ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు పాల్గొన్నారు.

ఊబకాయంపై నేడు అవగాహన సదస్సు

గుంటూరు మెడికల్‌: ప్రపంచ ఊబకాయ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక కొత్తపేట పశువుల ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఎస్వీఆర్‌ షుగర్‌ ఆసుపత్రిలో సదస్సు నిర్వహిస్తున్నట్లు డాక్టర్‌ వి.వి.రాంకుమార్‌ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అధిక బరువు తగ్గించుకోవడం ద్వారా 35 రకాల వ్యాధులు శరీరానికి దరి చేరకుండా కాపాడవచ్చని తెలిపారు. ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామంతో బరువు తగ్గిన పలువురు సదస్సులో మాట్లాడుతారని ఆయన వెల్లడించారు. అధిక బరువుతో బాధపడుతున్న వారు ఈ సదస్సును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా గజలక్ష్మి, నారాయణుల కల్యాణం



పాత గుంటూరు: అరండల్‌పేట 4వ లైనులోని శ్రీ అష్టలక్ష్మి సమేత లక్ష్మీ నారాయణస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేద మంత్రాల నడుమ గజలక్ష్మి, నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మర్రిపాటి ప్రసాద్‌ బృందం ఆధ్వర్యంలో స్వామికి శ్రీచక్ర అభిషేకాలు, నిత్య పూజలు జరిపారు. అనంతరం కల్యాణం సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన , రక్షా ధారణ, నవగ్రహారాధన, ప్రవర, సుముహూర్తం, మాంగల్య పూజ, అమ్మవారికి పుష్పాభిషేకం, సువాసినులకు కుంకుమ పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

గాంధీ పార్కుకు సొబగులు

- రూ.6కోట్లతో వేగంగా ఆధునికీకరణ పనులు
- రూ.40 లక్షలతో చిన్నారుల ఆట వస్తువులు
- వాకింగ్‌ ట్రాక్‌తోపాటు జిమ్‌ పరికరాలు అందుబాటులోకి..



చిన్నారుల కోసం సిద్ధం చేసిన ఆట వస్తువులు



పార్కులో ఏర్పాటు చేసిన ఫౌంటెన్లు



తీర్చిదిద్దిన డైనోసార్‌ బొమ్మ



క్లాక్‌ టవర్‌కు హంగులు



పిల్లలకు ఆట వస్తువులు

నెహ్రూనగర్‌: గుంటూరు నగరం నడిబొడ్డులో 6.3 ఎకరాల్లో విస్తరించి ఉన్న గాంధీ పార్కుకు మహర్దశ పట్టింది. ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పార్కును సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు తుది సొబగులు అద్దుతున్నారు. ఏళ్ల చరిత్ర కలిగిన గాంధీ పార్కును గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా శిథిలావస్థకు చేరింది. దీంతో కరోనా రాకముందు తాత్కాలికంగా మూసివేశారు. వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి రావడంతోపాటు, ఆ మరుసటి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ మేయర్‌ పీఠాన్ని దక్కించుకోవడంతో పార్కు అభివృద్ధికి బీజం పడింది. నగర కమిషనర్‌ కీర్తి చేకూరి చొరవతో రూ.6కోట్లతో ఆధునికీకరణకు చర్యలు చేపట్టారు. రూ.1.95 కోట్లతో పార్కు పరిసరాలు పచ్చగా ఉండేలా లాన్‌ ఏర్పాటు చేస్తున్నారు. వివిధ బొమ్మలతో పాటు ఎక్వేరియం, చిన్నారుల ఆట పరికరాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వాహనాల పార్కింగ్‌ కోసం స్థలాన్నీ కేటాయించారు. చిన్నారుల ఆట వస్తువుల కోసం రూ.40 లక్షలు వెచ్చించారు. డైనోసర్‌ థియేటర్‌ అందుబాటులోకి తీసుకువచ్చి త్రీడీ ఎఫెక్ట్‌ మూవీస్‌ వేయించేందుకు ప్రణాళిక రూపొందించారు. అలాగే స్కేటింగ్‌ రింగ్‌, ఇన్‌ గ్రౌండ్‌ ఫౌంటైన్‌ తదితర ఆహ్లాదకర వసతుల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు.

> **మూడోవారంలో ప్రారంభించేందుకు చర్యలు**
>
> ప్రజాప్రతినిధుల సహకారంతో గాంధీ పార్కు అభివృద్ధి పనులను పూర్తిచేస్తున్నాం. మార్చి మూడో వారంలోపు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాం. పార్కులో వాకింగ్‌ ట్రాక్‌, జిమ్‌, చిన్నారుల కోసం ఆట వస్తువులను ఏర్పాటు చేస్తున్నాం.
>
> – కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్‌

నేటి బాలలే రేపటి యువత

కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌ జయప్రకాష్‌ నారాయణ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జయప్రకాష్‌ నారాయణ తదితరులు

గుంటూరు మెడికల్‌: జాతీయ లేబర్‌ వెల్ఫేర్‌ బోర్డ్‌ చైర్మన్‌, బీజేపీ నేత వల్లూరు జయప్రకాష్‌ నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు లక్ష్మీపురం పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలులో 'ఎగ్జామ్‌ వారియర్స్‌ ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయప్రకాష్‌ నారాయణ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులుగా ఎదిగి సైంటిస్టులు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు, వైద్యులు, న్యాయమూర్తులు అవుతారని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడిని తట్టుకుని ఏ విధంగా పరీక్షలు రాయాలనే ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన 25 సూత్రాలు పాటిస్తే విజయం సాధించగలరని సూచించారు. మానసిక ఒత్తిడి తట్టుకుంటూ టీ అమ్మే స్థాయి నుంచి ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగిన ప్రధాని నరేంద్ర మోదీని రోల్‌ మోడల్‌గా తీసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం నగరంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలు, చలమయ్య హైస్కూలు, శ్రీ సత్యసాయి హైస్కూలు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ లిటరేచర్‌ డిపార్ట్‌మెంట్‌ ప్రముఖ్‌ పాలపాటి రవికుమార్‌, ఈదర శ్రీనివాసరెడ్డి, వనమా నరేంద్ర, వెలగలేటి గంగాధర్‌, దారా అంబేడ్కర్‌, ఇండ్ల శ్రీధర్‌, సాధు రామకృష్ణ, కామేపల్లి వెంకటేశ్వర్లు, కారంశెట్టి రమేష్‌, కన్నెగంటి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి: మేయర్‌



శ్రీనివాసరావుతోట శ్మశానవాటికలో పనులను పరిశీలిస్తున్న మేయర్‌

నెహ్రూనగర్‌: నగరంలోని శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఇందులో స్వచ్ఛంద సంస్థల్ని కూడా భాగస్వామ్యం చేస్తామని మేయర్‌ కావటి శివనాగ మనోహర్‌ నాయుడు తెలిపారు. శ్రీనివాసరావుతోటలోని హిందూ శ్మశానవాటికలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనుల్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాసరావుతోట శ్మశానవాటికను ఎనిమిదో డివిజన్‌లలోని సుమారు లక్ష మంది ప్రజలు వినియోగిస్తున్న దృష్ట్యా పలు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆవరణలో గ్రీనరీతో పాటు పెదకర్మ ఇతర కార్యక్రమాలు నిర్వహించే నిమిత్తం కొన్ని రోజుల పాటు అక్కడ ఉండేందుకు గదులు, భోజనశాల, వంటశాల, కేశ ఖండనం, స్నానపు గదులు, అస్థికలు భద్రపరిచే గదులు, వాటిక బయట రోడ్డు విస్తరణ, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎలక్ట్రికల్‌ దహన యంత్రంతో పాటు అన్ని సౌకర్యాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పార్థివ దేహాల్ని భద్రపరచడానికి ప్రత్యేకంగా ఐస్‌ మార్చురీ గదులు, బాక్సులతో పాటు పలు దేవతామూర్తుల విగ్రహాల్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగ రంగమణి , వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్‌, నగరపాలక సంస్థ డీఈఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

పెద్దల పండుగకు ఏర్పాట్లు చేయండి

ఎమ్మెల్యే ముస్తఫా



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: త్వరలో జరుగనున్న ముస్లిం పెద్దల పండుగకు ఏర్పాట్లు పూర్తి చేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్‌ మొహమ్మద్‌ ముస్తఫా అధికారులకు సూచించారు. ఆయన శుక్రవారం బారాఇమాం పంజాలోని ముస్లిం శ్మశానవాటికను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్మశానవాటికలో ముస్లింలు పెద్దల పండుగ పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. పెద్దల సమాధుల్ని అలంకరించుకునే నేపథ్యంలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యర్థాల్ని తొలగించాలని అధికారుల్ని ఆదేశించారు. వచ్చేవారంలో పండుగ నిర్వహించుకోనున్న నేపథ్యంలో రెండురోజుల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంజుమన్‌ కమిటీ అధ్యక్షుడు కర్నుమ, కార్యదర్శి అబ్దుల్‌ సలాం, కమిటీ సభ్యులు హిదాయతుల్లా, కార్పొరేటర్లు ఆబిద్‌బాషా, ఖాజామొహిద్దీన్‌ చిష్టి, సంకూరి శ్రీను, అధికారులు పాల్గొన్నారు.

7 నుంచి శ్రీ లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల

పాత గుంటూరు. కొరిటెపాడు ఆంజనేయపేటలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ ఆలయ తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 7 నుంచి 11 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయ్‌కుమార్‌ శుక్రవారం తెలిపారు. 7న ఉదయం 6 గంటలకు నెల పొంగళ్లు, విశేష పూజలు, సాయంత్రం 6 గంటలకు స్వామి ఊరేగింపు, 8న ఉదయం 8 గంటలకు గణపతి హోమం, అభిషేకాలు, 9న లక్ష్మీనారాయణ హోమం, విశేష పూజలు, 10న ఉదయం 7 గంటలకు చండీ హోమం, కుంకుమపూజ, 11న ఉదయం 11 గంటలకు అన్నదానం జరుగుతాయని వివరించారు.

గ్యాస్‌ ధరలను తగ్గించకపోతే ఆందోళన : సీపీఎం



ధర్నాలో మాట్లాడుతున్న పాశం రామారావు

పాత గుంటూరు: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. గ్యాస్‌ ధరలు పెరుగుదలకు వ్యతిరేకంగా శుక్రవారం బ్రాడీపేటలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో రాకముందు గృహ సిలిండర్‌ ధర రూ. 425 ఉండగా, ప్రస్తుతం రూ.1200కు పెరిగిందని తెలిపారు. వాణిజ్య సిలిండర్‌ ధర కూడా రూ. 2100లకు చేరడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెంచిన గ్యాస్‌ ధరల్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించకపోతే మిగతా వామపక్ష పార్టీలు, అభ్యుదయవాదులతో పెద్దఎత్తున పోరాటాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈమని అప్పారావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు బి. ముత్యాలరావు, కె. శ్రీనివాసరావు, ఎం.ఎ. చిష్టీ, మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కార్యదర్శి లక్కా అరుణకుమారి, నాయకులు షేక్‌ ఖాశీం షహీద్‌, ఏ.కల్యాణి, షేక్‌ మస్తాన్‌వలి, జి. వెంకట్రావు, షేక్‌ ఖాశీం వలి, ఎం.సాంబశివరావు, వి.మూర్తి, షేక్‌ బాషా పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా కలశ ప్రతిష్ట మహోత్సవాలు



కలశ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: బృందావన్‌ గార్డెన్స్‌లోని శ్రీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వేదమంత్రాల నడుమ మేళతాళాలతో ప్రధాన ప్రాకార గోపుర దివ్య కలశ ప్రతిష్ట అత్యంత వైభవంగా జరిగింది. తొలుత కలశాలకు క్షీరాభిషేకం చేశారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం మేళతాళాలతో క్రేన్‌ సహాయంతో గోపురంపై భాగానికి చేర్చారు. ఆలయ ప్రధాన పూజారి మాధవాచారి ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ట చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ద్వారపాలకుల విగ్రహాలు, గరుడాళ్వార్‌, ఆంజనేయస్వామి విగ్రహాల్ని ఆవిష్కరించి, స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆశీర్వచనం చేశారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్‌. మస్తానయ్య సత్కరించారు. శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా నిత్య పూజలతో పాటు శ్రీ వెంకటేశ్వర మహామంత్ర హోమం నిర్వహించారు. ఆలయ ఉపాధ్యక్షుడు లంక విజయబాబు ఆధ్వర్యంలో పద్మావతి గోదా సమేత శ్రీనివాసుని నగరోత్సవాన్ని శేష వాహనంపై తిరువీధుల్లో కన్నుల పండువగా చేశారు. బ్రహ్మోత్సవ విశేషాల్ని మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, వూటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, అచ్యుతరామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్‌ తదితరులు

ఏఎన్‌యూ: వన్యప్రాణుల్ని కాపాడుకోవడం అందరి బాధ్యతని వీసీ పి. రాజశేఖర్‌ తెలిపారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగార్జున యూనివర్సిటీ ఎకో క్లబ్‌, గుంటూరు నేషనల్‌ గ్రీన్‌ క్రార్ప్స్‌ సంయుక్తంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వన్యప్రాణుల సంరక్షణ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ ఆవశ్యకతను సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యూనివర్సిటీ ఎకో క్లబ్‌, ఎన్విరాన్‌మెంటల్‌ సైన్స్‌ విభాగాధిపతి ఆచార్య పి. బ్రహ్మాజీరావు మాట్లాడుతూ గుంటూరు నేషనల్‌ గ్రీన్‌ క్రార్ప్స్‌తో కలసి పలు పర్యావరణ, వన్యప్రాణుల, సహజ వనరుల సంరక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్‌ గ్రీన్‌ క్రార్ప్స్‌ సంస్థ కోఆర్డినేటర్‌ తిరుపతిరెడ్డి, ప్రతినిధి వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.

బోన్‌ బ్రిడ్జి శస్త్రచికిత్సతో వినికిడి సమస్య నుంచి విముక్తి

- డాక్టర్‌ సుబ్బారాయుడు
- ఏపీలో తొలిసారిగా చేసినట్లు వెల్లడి



చిన్నారితో డాక్టర్‌ సుబ్బరాయుడు, పక్కన ఆడియాలజిస్ట్‌ నరేంద్ర

గుంటూరు మెడికల్‌: ఏపీలో మొట్టమొదటిసారిగా బోన్‌ బ్రిడ్జి శస్త్రచికిత్స చేసి వినికిడి సమస్యతో బాధపడుతున్న ఓ చిన్నారి వినగలిగేలా చేశామని రాధికా రాయుడు స్పెషాలిటీ హాస్పిటల్‌ అధినేత డాక్టర్‌ యార్లగడ్డ సుబ్బారాయుడు చెప్పారు. స్థానిక గుంటూరువారితోటలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్‌ వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా సీకేపల్లికి చెందిన కె.రాఘవరెడ్డి, సుభద్రమ్మ దంపతుల ఎనిమిదేళ్ల కుమారుడు శ్రీనివాసులురెడ్డి చెవి నిర్మాణ లోపంతో జన్మించాడని, అతడికి రూ. 5.50 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ద్వారా ఉచితంగా ఫిబ్రవరి 10న చేసినట్లు వివరించారు. ఆధునిక టెక్నాలజీ వినియోగించి బోన్‌ బ్రిడ్జి శస్త్రచికిత్స చేసి బోన్‌ కండక్షన్‌ ఇంప్లాంట్‌ అమర్చామని చెప్పారు. ఏపీలో మొట్టమొదటిసారిగా తమ ఆసుపత్రిలో బోన్‌ బ్రిడ్జి ఆపరేషన్‌ నిర్వహించినట్లు డాక్టర్‌ సుబ్బారాయుడు వెల్లడించారు. వెలుపలి చెవి, మధ్య చెవి ఏర్పడకుండా వినికిడి లోపంతో బాధపడే చిన్నారులకు లోపలి చెవికి శబ్దం చేరవేసేందుకు పుర్రె ఎముకల్లో మాస్టాయిడ్‌ ఎముకకు అనుసంధానం చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీతో బోన్‌ బ్రిడ్జి శస్త్రచికిత్స (బీసీఐ-602) ఎంతో ఉపయోగపడుతోందని వివరించారు. ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి భారత దేశంలోనే మొట్టమొదటిసారిగా పుట్టుకతో వినికిడి సమస్య ఉన్న చిన్నారుల రెండు చెవులకు ఆపరేషన్‌ చేసే సౌకర్యం ఆరోగ్యశ్రీలో కల్పించారన్నారు. ఆయన తండ్రి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వై.ఎస్‌.రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీలో ఒక చెవికి కాక్లియర్‌ ఇంప్లాంట్‌ ఆపరేషన్‌ సౌకర్యం కల్పిస్తే, తనయుడు సీఎం వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి రెండు చెవులకు అవకాశం కల్పించడం చిన్నారులకు వరమని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో ఆడియాలజిస్ట్‌ టంగుటూరి నరేంద్ర పాల్గొన్నారు. బాలుడి తల్లిదండ్రులు ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న నగదు ఖాతాలో జమ



ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన బాధితురాలు

నగరంపాలెం: యాప్‌ ద్వారా ఓ ఉద్యోగిని లక్షల్లో మోసపోయింది. ఇక డబ్బులు వచ్చే అవకాశాల్లేవని భావించింది. అయితే గతంలో ఓ మహిళ కూడా పది లక్షల రూపాయలకు మోసపోగా, గుంటూరు సైబర్‌ క్రైం (ఐటీ కోర్‌)లో ఫిర్యాదు చేశాక, ఆమె ఖాతాలో జమ చేయించారు. ఇదే విషయాన్ని తెలిసిన వారు బాధితురాలి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె ఫిర్యాదు చేయగా, డబ్బులు జమ చేయించారు. గుంటూరు సైబర్‌ క్రైం (ఐటీ కోర్‌) పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలిలోని చెంచుపేట వాసి నెలకుర్తి త్రివేణి ప్రభుత్వ ఉద్యోగిని, ఆమె కాటర్పిల్లర్‌ యాప్‌లో పెట్టుబడులు నిర్వహించేది. ఈ క్రమంలో రెండు నెలలు కిందట రూ.4.75 లక్షలు మోసపోయింది. దీంతో ఆ డబ్బులు వచ్చే అవకాశం లేదని నిర్ణయించుకుంది. ఈలోగా తెలిసిన వారు బాధితురాలికి సైబర్‌ క్రైంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో ఆమె అక్కడ ఫిర్యాదు చేసి, జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌ హఫీజ్‌ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఐటీ కోర్‌ ఇన్‌చార్జి ఎస్‌ఐ డి.వెంకటకృష్ణ, ఆయన బృందం ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి వద్ద బ్యాంక్‌ వివరాలను నమోదు చేసుకుని విచారణ వేగవంతం చేశారు. సంబంధిత బ్యాంక్‌ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో త్రివేణి బ్యాంక్‌ ఖాతాకు రూ.2,55,200 జమ అయ్యాయి. జిల్లా పోలీస్‌ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆమెకు ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్‌ నగదు అందించారు.సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసపూరిత యాప్‌ల జోలికి వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా బాధితులు ఉన్నట్లయితే ఉచిత నంబర్‌ 1930కి ఫిర్యాదు చేయాలని ఎస్పీ తెలిపారు.

అకడమిక్‌ కేలండర్‌ను విధిగా అమలు పర్చాలి



విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఉర్దూ డీఐ ఖాసీం

గుంటూరు ఎడ్యుకేషన్‌: పాఠశాలల నిర్వహణలో అత్యంత కీలకమైన అకడమిక్‌ కేలండర్‌ను విధిగా అమలు పర్చాలని ఉర్దూ డీఐ షేక్‌ మొహ్మద్‌ ఖాసీం ఉపాధ్యాయులకు సూచించారు. లాలాపేట పరిధిలోని నగరపాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠ్యాంశాల వారీగా విద్యార్థుల సామర్థ్యాల్ని పరిశీలించారు. జాతీయ సైన్స్‌ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. జగనన్న గోరుముద్ద ఆహార పదార్థాల్ని రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాల రికార్డులు పక్కాగా నిర్వహించాలని, పాఠ్య ప్రణాళికలు రూపొందించుకుని బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల నోట్‌ పుస్తకాలు, వర్క్‌ పుస్తకాల్ని తప్పనిసరిగా పరిశీలించి తగు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.

లక్ష్మీపురం మెయిన్‌ రోడ్డులో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగించిన ప్రాంతం

గుంటూరు ఎడ్యుకేషన్‌ : లక్ష్మీపురం మెయిన్‌ రోడ్డులో బేకర్స్‌ఫన్‌ ఎదుట ప్రధాన రహదారి ముఖద్వారం వద్ద ఆక్రమణను నగర పాలకసంస్థ పట్టణ ప్రణాళిక విభాగం తొలగించింది. నూతనంగా నిర్మించిన సిమెంట్‌ రోడ్డు మలుపు వద్ద ఆక్రమణలపై గత నెల 27న ''సాక్షి'' ప్రచురించిన కథనానికి నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. ఆక్రమణను తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

సాక్షి ఫ్యామిలీ

గుంటూరు

శనివారం ॥ 4-3-2023



కె. రామలక్ష్మి

తెలుగు సాహిత్యలోకం నుంచి రచయిత్రి కె.రామలక్ష్మి (92) వీడ్కోలు తీసుకున్నారు. రచయిత్రిగా, ఆరుద్ర సతీమణిగా, మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగువారి ప్రతినిధిగా, నాటి సాహితీ సమూహాలలో కీలకమైన వ్యక్తిగా, సినిమా రంగంలో రచయిత్రిగా ఆమె సాగించిన యాత్ర సుదీర్ఘమైనది. ఆమె మరణంతో ఒక కాలపు తెలుగు సాహితీ చరిత్రకు మిగిలిన ఆఖరు సాక్షి లేకుండా పోయినట్టయ్యింది.

నివాళి

ఆమె ప్రతి అక్షరం స్త్రీ పక్షం

స్టెల్లా మేరీ స్టూడెంట్

స్వస్థలం కాకినాడ అయినా కె.రామలక్ష్మి చదువు చెన్నైలోనే సాగింది. స్టెల్లా మేరీ కాలేజీలో చదువుకుని ఇంగ్లిష్ భాషలో పట్టు సాధించారు. 'ఐ యామ్ ఏ స్టెల్లామేరియన్' అని గర్వంగా చెప్పుకునేవారు. కాలేజీలో ఒక కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రఖ్యాత జర్నలిస్టు ఖాసా సుబ్బారావు ఇంగ్లిష్‌లో ఉపన్యాసం ఇచ్చిన కె.రామలక్ష్మిని చూసి పరీక్షలు అయిపోయాక తనని కలవమని చెప్పారు. 'స్వతంత్ర' పత్రికలో ఇంగ్లిష్ విభాగంలో పాత్రికేయురాలిగా ఉద్యోగం ఇచ్చారు. 'తెలుగు స్వతంత్ర'కు ఎడిటర్‌గా ఉన్న ఖాసా సుబ్బారావు కోరిక మేరకు 'నడుస్తున్న చరిత్ర' కాలమ్ రాశారు రామలక్ష్మి. ఆమె ఇంటిలో ప్రతి సాయంత్రం సాహితీచర్చలు జరిగేవి. వాటికి ఆరుద్ర, శ్రీరంగం



కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతిలతో ఆరుద్ర, రామలక్ష్మి

నారాయణబాబు, శ్రీశ్రీ తదితరులు హాజరయ్యేవారు. ఆరుద్ర, రామలక్ష్మి పరస్పరం ఇష్టపడి ఆ రోజుల్లో అంటే 1954ఏప్రిల్30న రిజిస్టర్డ్ మేరేజీ చేసుకున్నారు. ఈ పెళ్లికి దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీ సాక్షి సంతకాలు చేశారు. శ్రీశ్రీ తన పెళ్లికి సాక్షి సంతకం చేయాలని ఆరుద్ర భావించడం వల్ల ఇది జరిగింది. శ్రీశ్రీ రామలక్ష్మిని 'అత్తగారు' అని సరదాగా పిలిచేవారు. అయితే శ్రీశ్రీ ధోరణిని రామలక్ష్మి చివరి వరకూ వ్యతిరేకిస్తూనే వచ్చారు.

ఆరుద్రకు అండా దండా

ఆరుద్ర సినిమా రంగంలో కృషి చేయడానికి, 'సమగ్రాంధ్ర చరిత్ర' పరిశోధన పూర్తి చేయడానికి రామలక్ష్మి అందించిన అండదండలే కారణం.

రచయిత్రి రామలక్ష్మి ఆరుద్ర కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నివాసంలో మృతి
- 100 కుపైగా పుస్తకాలు రాసిన రామలక్ష్మి
- జీవనజ్యోతి సినిమాకు ఉత్తమ కథా రచయితగా నంది అవార్డు
- జర్నలిస్టుగా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలు

ప్రముఖ రచయిత ఆరుద్ర సతీమణి కె.రామలక్ష్మి (92) కన్నుమూశారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆస్మాన్‌ఘడ్‌లో ఉన్న నివాసంలో తుదిశ్వాస విడిచారు. రామలక్ష్మి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా కోటనందూర్‌లో 1930 డిసెంబర్ 31న జన్మించారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తిచేశారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం అభ్యసించారు. 1954లో ప్రముఖ కవి ఆరుద్రను వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు కుమార్తెలు. 1951 నుంచే రామలక్ష్మి రచనా ప్రస్థానం మొదలైంది. వివాహమైన తర్వాత 'రామలక్ష్మి ఆరుద్ర' కలం పేరుతో రచనలు చేశారు. మొత్తం 100 కు పైగా పుస్తకాలు రాశారు. ఆంధ్రపత్రికలో ఆమె సుదీర్ఘకాలం నిర్వహించిన 'ప్రశ్న జవాబు' శీర్షిక ప్రసిద్ధి చెందింది. విడదీసే రైలుబళ్లు, అవతలిగట్టు, మెరుపుతీగె, తొణికిన స్వర్గం, మానని గాయం, ఆణిముత్యం, పెళ్లి, ప్రేమించు ప్రేమకై, ఆడది, ఆశకు సంకెళ్లు, కరుణ కథ, లవంగి, ఆంధ్ర నాయకుడు, పాండురంగని ప్రతిజ్ఞ, నీదే నా హృదయం, అద్దం, ఒక జీవికి స్వేచ్ఛ వంటి కథా సంకలనాలను రామలక్ష్మి రచించారు. తెలుగు సాహిత్య రంగానికి చేసిన సేవలకు గాను ఆమెకు గృహలక్ష్మి, స్వర్ణకంకణం సహా పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు దక్కాయి.

ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు...

రామలక్ష్మి పలు సినిమాలకు కథలు అందించారు. 1975వ సంవత్సరంలో జీవన జ్యోతి సినిమా కథకు గాను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారు. కాసా సుబ్బారావు నిర్వహించిన స్వతంత్ర దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. 1978లో ఉత్తమ జర్నలిస్టుగా రామానాయుడు అవార్డు అందుకున్నారు. పలు స్త్రీ సంక్షేమ సంఘాల్లో సేవలు అందించి మహిళల శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ రీజనల్ ప్యానెల్ సభ్యురాలిగా కూడా పనిచేశారు. రామలక్ష్మి ఆరుద్ర మృతిపట్ల పలువురు రచయితలు, సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు సంతాపం తెలిపారు. శుక్రవారం సాయంత్రమే ఎస్ఆర్‌నగర్ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

వీరికి ఐదుగురు కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతి. వీరి పెంపకం, చదువు బాధ్యతలకోసం ఆరుద్ర సమయాన్ని తీసుకోకుండా ఆమే తన సమయమంతా వెచ్చించారు. 'ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం కోసం విపరీతంగా సమయం ఇవ్వాలనుకునేవాడు. కాని ఇల్లు గడవాలి కదా. సినిమా రంగంలో పని చేస్తేనే డబ్బులు వస్తాయి. అందుకని నేనేమి అనకుండా గబగబా కొన్ని పాటలు రాసేసి ఆ డబ్బు అప్పజెప్పి మళ్లీ పరిశోధనలో పడేవాడు' అన్నారు రామలక్ష్మి. ఆరుద్రకు అనారోగ్యం వస్తే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ సహాయం అందేలా చూశారామె. 'నేను మరణించినప్పుడు ఎటువంటి హంగామా చేయవద్దు' అని ఆరుద్ర కోరడం వల్ల 1998లో ఆరుద్ర మరణించినప్పుడు కేవలం ముగ్గురు నలుగురు స్నేహితులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించి ఆ తర్వాతే మరణవార్తను లోకానికి తెలియచేశారు. ఇది సాహిత్య ప్రియులను బాధించినా రామలక్ష్మి ధోరణి అలాగే ఉండేది.

సినిమా రచయిత్రి


కె.రామలక్ష్మికి సినిమా రంగంలో అందరూ సుపరిచితులు స్నేహితులు. వారిలో భానుమతి రామకృష్ణ, జయలలిత, వాణిశ్రీ తదితరులు ఉన్నారు. కె.విశ్వనాథ్ తీసిన 'జీవనజ్యోతి' సినిమాకు రామలక్ష్మి కథను అందించారు. ఈ సినిమా నిజానికి వాణిశ్రీ కోసమే రాశారు. కె.రామలక్ష్మి రాశారని వాణిశ్రీ నటించారు. దీని నిర్మాణ సమయంలో విశ్వనాథ్‌కు, రామలక్ష్మికి వాదోపవాదాలు నడిచాయి. దాంతో కె.విశ్వనాథ్ విజయవాడలో జరిగిన శతదినోత్సవంలో 'ఇకపై ఇతరులు రాసిన కథలతో నేను సినిమాలు తీయను' అని ప్రకటించారు. రామలక్ష్మి రాసిన మరో సినిమా 'గోరింటాకు'. అయితే దీని మీద ఆ రోజుల్లో వివాదం చెలరేగింది. దాసరి నారాయణరావు స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో తెర వెనుక ఉండి పని చేసిన వారిలో రామలక్ష్మి కూడా ఒకరు. ఆమె 1970లలో సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా పని చేశారు.

స్త్రీ పక్షపాతి

రామలక్ష్మి నిత్య జీవితంలోనే కాదు రచనా జీవితంలోనూ ఆధునికురాలు. ఛాందసాలు లేని జీవనం గడపాలని, భార్యాభర్తలు స్నేహమయ జీవనాన్ని అనుభవించాలని, స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆ రోజుల్లోనే తన కథలలో చెప్పారామె. 1954లో ఆమె తన తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' వెలువరించారు. ఈ సంపుటిలోని 'చీలిన దారులు' అనే కథలో ఒక జంట పెళ్లి చేసుకోకుండా సహజీవనం ప్రారంభిస్తారు. పెళ్లి ప్రేమను చంపేస్తుంది అని ఆ కథలో రాసి అప్పటికి తెలియని సహజీవనాన్ని ప్రతిపాదించారామె. 'తొణికిన స్వప్నం', 'ఒక జీవికి స్వేచ్ఛ', 'అద్దం' తదితరాలు ఆమె ఇతర కథా సంపుటాలు. భార్యాభర్తలు స్నేహితులుగా ఉండాలని సూచిస్తూ 1970లలో ఆమె రాసిన 'పార్వతి కృష్ణమూర్తి కథలు' పాఠకాదరణ పొందాయి. ఇందులో భార్య అరమరికలు లేకుండా భర్తతో తన అభిప్రాయాలను చెబుతుంది. స్నేహాన్ని, చొరవను ప్రదర్శిస్తుంది. భార్యంటే భర్త చెప్పినట్టుగా పడుండాలనే నాటి ధోరణికి ఈ పాత్ర పూర్తి భిన్నం. రామలక్ష్మి రాసిన కథల్లో 'అదెక్కడ' విశిష్టమైనది. ఆ కథలో ముఖ్య పాత్ర తన పేరు మర్చిపోతుంది. దాని కారణం భర్త, పిల్లలు అందరూ 'అది' అని పిలుస్తూ ఉండటమే. చివరకు ఆమె ఒకరోజు ఇంట్లో నుంచి వెళ్లిపోతుంది. భర్త 'అదెక్కడ' అని ఎందరిని అడిగినా కనిపించదు. పురుషుడు మోసం చేస్తే స్త్రీ సింగిల్ మదర్‌గా జీవించగలదనే సందేశం ఇస్తూ కథలు రాశారు. బేలగా ఉండే స్త్రీలను అలాంటి పాత్రలను రామలక్ష్మి హర్షించలేదు. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా తమ జీవితాన్ని మలుచుకోవాలని కోరుతారు.

ఆమె రచనలను ఈ తరానికి మళ్లీ చేరువ చేయాల్సి ఉంది.

కళ





విజేత కుమార్

ఫుట్‌బాల్ చెప్పిన కథ

మార్పు అనేది సామాజిక ఉద్యమాలతోనే కాదు...సరదాగా మొదలయ్యే ఆటలతో కూడా సాధ్యపడుతుందని నిరూపించింది రాజస్థాన్‌కు చెందిన మహిళా జన్ అధికార్ సమితి. ఫుట్‌బాల్ ఆటతో అమ్మాయిల ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పు, చైతన్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది కికింగ్ బాల్స్...

రాజస్థాన్‌లో అనేక ప్రాంతాల్లో బాల్యవివాహాలు సర్వసాధారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాల్యవివాహాలకు అడ్డకట్టవేయడానికి మహిళా జన్ అధికార్ సమితి అమ్మాయిల కోసం ఊళ్లలో 'ఫుట్‌బాల్ క్లబ్'లను ఏర్పాటు చేసింది.

బాల్యవివాహాల నిరోధానికి, ఫుట్‌బాల్ ఆటకు సంబంధం ఏమిటి? అనే సందేహం సహజంగానే వస్తుంది. అయితే ఆ ఫుట్‌బాల్ క్లబ్‌లు ఆట మెలకువలకు మాత్రమే పరిమితం కాకుండా పరివర్తన కేంద్రాలుగా మారడమే కొసమెరుపు.

ఆట ఆడటం కోసం సాయంత్రం ఎంతో మంది అమ్మాయిలు గ్రౌండ్‌కు వస్తారు. ఆట పుణ్యమా అని వారి మధ్య స్నేహం పెరిగింది. ఆట అయిపోయిన తరువాత రకరకాల కబుర్లు చెప్పుకునేవారు. అన్ని విషయాలతో పాటు బాల్యవివాహాల టాపిక్ కూడా వచ్చేది.

అంతమాత్రాన పెద్దలను వ్యతిరేకించగలరా? తరాల సంప్రదాయాన్ని కాదనగలరా?

'అవును....అనగలరు' అని ఎందరో అమ్మాయిలు నిరూపించారు. 'చదువు తరువాతే పెళ్లి' అని తల్లిదండ్రులతో గట్టిగా చెప్పారు.

కట్ చేస్తే...

ముంబైలో ఉంటున్న విజేత కుమార్ బ్రాండెడ్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు రూపొందించడంలో మంచి పేరు తెచ్చుకుంది. తన తొలి షార్ట్ ఫిల్మ్ 'బ్లాజ్' న్యూయార్క్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బెస్ట్ షార్ట్ ఫిల్మ్' అవార్డ్ అందుకుంది.

కొంత కాలం క్రితం విజేత తన స్వస్థలం రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు వెళ్లింది. ఒక సాయంత్రం పూట బాల్య జ్ఞాపకాలను పలకరించడానికి తాను చదువుకున్న స్కూలుకు వెళ్లింది. అక్కడ ఆడపిల్లలు చాలా సీరియస్‌గా ఫుట్‌బాల్ ఆడుతుంటే అబ్బురపడింది.

ఆసక్తిగా ఆ అమ్మాయిలను పలకరించింది విజేత.

'స్కూల్ పూర్తయిన తరువాత ఇంటికి వెళితే ఇక బయట అడుగుపెట్టడం అంటూ ఉండేది కాదు. అలాంటిది ఫుట్‌బాల్ ఆట వల్ల రోజూ సాయంత్రం గ్రౌండ్‌కు రాగలుగుతున్నాను' అని తనకు లభించిన స్వేచ్ఛ గురించి చెప్పింది ఒక అమ్మాయి.

ఫుట్‌బాల్ ఆట వల్ల తమలో పెరిగిన

> 'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

ఆత్మవిశ్వాసం, నలుగురితో కలిస్తే వచ్చే ధైర్యం, బాల్యవివాహాలపై వ్యతిరేకత గురించి మరో అమ్మాయి వివరంగా చెప్పింది. ఇలా అందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

పిల్లలతో కలిసి ఈ డాక్యుమెంటరీని చూసింది విజేత. 'కికింగ్ బాల్స్' పిల్లలకు నచ్చింది. ఆ తరువాత ప్రపంచ ప్రేక్షకులకు కూడా నచ్చింది.

బ్యూటిప్స్

ఏమి చేయకూడదంటే...

అందానికి చిట్కాలు పాటించడానికి ముందు ఏమేం చేయకూడదో తెలుసుకుంటే మంచిదేమో! ఇవన్నీ తెలిసినవే, అయినా ముఖ్యంగా నిర్లక్ష్యం చేసేదిక్కడే.



- మొటిమలను గిల్లితే, మచ్చలు పడతాయి. వీటిని పోగొట్టుకోవడానికి చాలా కష్టపడాలి. గిల్లినప్పుడు మొటిమల నుండి వెలువడిన స్రావం ముఖం మీద ఎక్కడ తగిలితే అక్కడ కూడా మొటిమలు వస్తాయి.
- ఫంక్షన్‌కు వెళ్లే ముందు మేకప్ వేసుకుంటాం, కానీ తిరిగి వచ్చాక తుడిచేయడానికి బద్ధకించి అలాగే నిద్ర పోతాం. కొబ్బరినూనెతో తుడుచుకునేంత ఓపిక లేకపోతే కనీసం గోరువెచ్చని నీటిలో కాటన్ ముంచి అయినా మేకప్ క్లీన్ చేయాలి.
- మేకప్ సామగ్రిని ప్రతి ఆరునెలలకొకసారి అప్‌డేట్ చేసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్ చెక్ చేసుకుని, వాటిని కిట్ నుండి తొలగించాలి.
- మేకప్‌లో ఫౌండేషన్ ఇంపార్టెంట్. దీన్ని జాగ్రత్తగా వేసుకోవాలి. స్కిన్ కలర్‌కు సూటయ్యే షేడ్ వాడాలి. అవసరమైన మేరకే వాడాలి.
- హెయిర్ కండిషనర్ వాడేటప్పుడు చిన్న జాగ్రత్త కావాలి. జుట్టు కుదుళ్లకు తగలకుండా అప్లై చేయాలి. జుట్టు పొడిబారినప్పుడు మాత్రమే కండిషనర్ వాడాలి.

ఇంటిప్స్

సహజమైన రూమ్ ఫ్రెషనర్

- అరకప్పు టేబుల్ సాల్ట్ తీసుకుని, అందులో గులాబీ రేకులను వేయాలి. వీటితోపాటు ఒక స్పూన్ లవెండర్ ఆయిల్ లేదా ఆల్మండ్ ఆయిల్ వేయాలి. అంతే! గది సువాసనలతో నిండిపోతుంది.
- దీన్ని మరింత సులువుగా చేయాలంటే వొలిచిన నారింజ లేదా కమలా పండు మీద టేబుల్ స్పూన్ సాల్ట్‌ను చల్లి ఒక మూలన పెడితే సరి!
- సింక్ మెరవడానికి: ఖరీదైన క్లెన్సర్ జోలికి పోకుండా సింక్ పరిశుభ్రంగా... కొత్త దానిలా కనిపించాలంటే... నిమ్మరసంలో కొద్దిగా టేబుల్ సాల్ట్ వేసి సింక్‌ను తుడిస్తే చాలు... చూస్తుండగానే సింక్ కొత్తదానిలా మెరుస్తుంది.



పచ్చదనాల పొదరిల్లు

మొక్కలో మొక్కనై!

మందారాలు 16 రంగులున్నాయి.
జామ చెట్లు ఏడురకాలున్నాయి.
అరటి పండ్ల చెట్లు ఐదు రకాలు.
వేప, సీమచింత, కానుగ...
మర్రి, రావి, జువ్వి, కొబ్బరి...
కుండీల్లో ఒదిగిపోయాయి.
రణపాల, కొండపిండి...
ఇన్సులిన్ ప్లాంట్, కప్పరిల్ల...
ఔషధమొక్కల లిస్ట్ ఇది.
ఇవన్నీ ఉన్నది నర్సరీలో కాదు.
మొక్కల్ని పిల్లల్లా పెంచే మంజుల ఇంట్లో.
మనం తినే పంటలు పండించుకుంటున్నాం.
పీల్చే గాలిని కూడా 'పెంచుకుందాం' అంటోందామె.

''ఆమెకు గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరిన వాళ్లు లేరు. తనకు తానుగా తీసుకున్న చాలెంజ్ కూడా కాదు. ఆమె మనసు కోరుకున్న ముచ్చట. పచ్చదనంతో ఆమె పాతికేళ్ల ప్రస్థానానికి ప్రతిరూపం ఈ ఇల్లు. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, గంగపట్నం గ్రామంలో 65 అంకణాల స్థలంలో ఉన్న ఈ ఇంటి పేరు 'జీఆర్‌కే గార్డెన్'. గేటు ముందు నిలబడి చూస్తే ఇల్లు కనిపించదు. అల్లిబిల్లిగా అల్లుకున్నట్లున్న చెట్లు, తీగలను తొలగించి చూస్తే తప్ప గోడలు కనిపించవు. ఎన్ని మొక్కలున్నాయి? ఎన్ని రకాలున్నాయి? అని లెక్కపెట్టాలంటే సాధ్యమయ్యేటట్లు కనిపించలేదు. ఆ వివరాలన్నీ ఈ మొక్కల తల్లి మంజుల చెప్పాల్సిందే.

సేకరణ చిన్న పని కాదు!

''నేను ఐసీడీఎస్‌లో ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌ని. ఉద్యోగంలో పిల్లల్ని చూసుకోవడం, ఇంట్లో మొక్కల్ని పెంచుకోవడమే నా లైఫ్. పండ్ల మొక్కలు దేశీవిదేశీ అన్నీ కలిపి వందకు పైగా ఉన్నాయి. తీగజాతితో కలిపి పూల మొక్కలు వందల్లో ఉన్నాయి. బాటిల్స్, కుండీలు, డ్రమ్ములు మూడు వేలకు పైగా ఉన్నాయి. నా దగ్గర పేపర్ వైన్ మొక్క కూడా ఉంది. యూ ట్యూబ్‌లో మ్యాడ్ గార్డెనర్ మాధవి గారి గార్డెన్ నుంచి తీగజాతులు తెప్పించుకున్నాను. హైదరాబాద్ నర్సరీ మేళాల నుంచి సేకరించాను. బెంగళూరు నుంచి కూడా తెచ్చుకున్నాను. మొక్కలు ఎన్ని కొంటున్నానో లెక్క చూసుకోకుండా కొనేస్తాను. కానీ బస్సు వాళ్లను రిక్వెస్ట్ చేసి వాటిని ఇంటికి తెచ్చుకోవడం చాలా కష్టమయ్యేది. స్వయంగా వెళ్లడం కుదరని నర్సరీలకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో అక్కడ ఉన్న మొక్కలను చూసి నా దగ్గర లేనివేవో చెప్పి తెప్పించుకుంటున్నాను. యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్యాల మొక్కలన్నీ ఉన్నాయి, కానీ లవంగాల తీగ మాత్రం దొరకలేదు.

సీతాఫల కుటుంబం

సీతాఫలం మనకు బాగా తెలుసు. నా దగ్గర రామాఫలం, లక్ష్మణఫలం, హనుమఫలం కూడా ఉన్నాయి. కుండీల్లో కాసే పనస నుంచి యాపిల్ మూడు రకాలు, కివీ, అవొకాడో కూడా పెంచుతున్నాను. ఓ సారి ఎవరితోనో మాట్లాడుతూ 'మా పాప కంటే ముందు మొక్కలనే చూసుకుంటాను'ని చెప్పాను. ఆ మాటను గుర్తు చేసి మరీ దెప్పుతుంటుంది మా అమ్మాయి. తానిప్పుడు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. మా వారు కృష్ణపట్నం పోర్టులో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్. ఆయనకు ఇంటి నిండా మొక్కలున్నాయని మాత్రమే తెలుసు. మొక్కల పేర్లు కూడా తెలియదు. ఆయన మొక్కల సరదా అంతా సెల్ఫీలు తీసుకుని వాట్సాప్ డీపీలు పెట్టుకోవడం వరకే. మొక్కల పని అంతా నేను, మా అమ్మ చూసుకుంటాం. ఉదయం రెండు గంటల సేపు నేను టెర్రస్ మీద పని చేస్తాను. నేను, మా వారు డ్యూటీలకు వెళ్లిన తర్వాత మా అమ్మ మూడు గంటల సేపు కింద ఉన్న మొక్కల పని చూసుకుంటుంది. సాయంత్రం వచ్చిన తర్వాత కూడా నాకు గంట– రెండు గంటల సేపు ఎరువు కలపడం వంటి ఏదో ఒక పని ఉంటుంది.

చెట్లమ్మ

మా ఇంటి ఇరుగుపొరుగు వాళ్లు 'టెర్రస్ మీద ఇంత బరువు పెడుతున్నావ్. ఇల్లు జాగ్రత్త' అంటూ ఉంటారు. ఇల్లు పాడయితే మరో చిన్న ఇల్లు కట్టుకుంటాను. మొక్కలు పోతే మళ్లీ మొక్కలు పెరగాలంటే ఎన్నో ఏళ్లు పడుతుందని చెబుతాను. నీ చుట్టుపక్కల ఉండడం మాకూ మేలే. మేము పెంచకపోయినా నువ్వు పెంచిన మొక్కల గాలిని పీల్చుకుంటున్నాం అని నవ్వుతారు. మా చెల్లి కొడుకైతే నన్ను చెట్లమ్మ అనే పిలుస్తాడు. ప్రతి ఇల్లూ మొక్కల్ని పెంచితే గాలి ఎందుకు కలుషితమవుతుంది? దారికి అడ్డు వస్తోందని, మరేదో పనులకు ఇబ్బందవుతోందని... ఎన్నో ఏళ్లు పెరిగిన చెట్టుని నిలువునా నరికేస్తుంటారు. పెరిగిన చెట్టుని నరకడం కాదు, ఒక చెట్టుని పెంచి చూడండి అని గొంతెత్తి అరవాలనిపిస్తుంటుంది'' అని మొక్కల మీద తన ప్రేమను వ్యక్తం చేశారు గుడి మంజుల.

– వాకా మంజులారెడ్డి

ఎనిమిదిళ్లు మారాను!



మొక్కల కోసం మార్కెట్‌లో దొరికే కుండీలు చాలవని పెద్ద పెద్ద సిమెంట్ కుండీలు కూడా నేనే స్వయంగా చేసుకున్నాను. ఇల్లు మారిన ప్రతిసారీ ఈ కుండీలను తీసుకెళ్లడం ఎంత కష్టమయ్యేదో. అలా ఎనిమిదిళ్లు తిప్పాను. నా కష్టం చూసి మా నాన్న ఈ ఇల్లు అమ్మకానికి వచ్చిన సంగతి తెలిసి వెంటనే కొన్నారు. అప్పుడు కూడా 'నీకు ఇల్లు' అని చెప్పలేదు. 'నువ్వు మొక్కలు పెంచుకోవడానికి ఇల్లు' అని చెప్పారు. నాన్న గుర్తుగా నాటిన మామిడి చెట్టు చూడండి ఎంత ఎదిగిందో చూడండి.

– గుడి మంజుల, మొక్కల ప్రేమికురాలు